# ముున్నుడి

కలియుగ వైకుంఠమనబడే తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరునికి చెందిన ఇతివృత్తమే శ్రీనివాసకళ్యాణం.

భృగుమహర్షి దురహంకారం కారణంగా వైకుంఠంనుండి భూలోకానికి చేరుకున్న లక్ష్మీదేవిని వెదుకుతూ శ్రీనివాసుడు కూడా భువిని చేరుకుంటాడు. ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వకుళమాత సాయంతో, తన కపటోపాయంతో వివాహం చేసుకున్న శ్రీనివాసుని కళ్యాణగాథను యక్షగాన ప్రక్రియలో ఇటు సంగీతప్రియులకు, అటు సాహిత్యాభిమానులకూ ప్రీతిపాత్రంగా రచించిన శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారు అభినందనీయులు.

ధార్మికప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆధ్యాత్మికగ్రంథాల్ని ప్రచురించి వెలువరించడానికి నడుం కట్టారు. ఈ ధార్మిక గ్రంథప్రచురణలో భాగంగా వెలువడిన ఈ 'శ్రీనివాసకళ్యాణం' (యక్షగానం) పాఠకుల ఆదరణకు పాత్రమౌతుందని అభిలషిస్తున్నాను.

బి. కరుణాకరరెడ్డి

**(భూమన కరుణాకరరెడ్డి)**

**అధ్యక్షులు**

**తి.తి.దే.పాలకమండలి, తిరుపతి.**

# ఆముఖం

లక్ష్మీపతి ఆజ్ఞమేరకు గరుత్మంతుడు వైకుంఠంనుండి క్రీడాద్రిని పుష్కరిణితోపాటు పెకలించి తెచ్చి భూలోకంలో ప్రతిష్ఠించాడని, గరుడుని చేత భూమిమీదకు తేబడిన కారణంగా ఈ పర్వతాన్ని గరుడాద్రి అని పిలుస్తున్నారన్న ఐతిహ్యంతో ఈ శ్రీనివాసకళ్యాణ మనే యక్షగానం ప్రారంభమవుతుంది.

తెలుగుసాహితీలోకంలో లబ్ధ ప్రతిష్ఠులైన కాటూరి వేంకటేశ్వరరావు గారిచే రచింపబడిన ఈ యక్షగానంలో సూత్రధారుడు, కథకుడు ప్రధాన భూమికలను పోషిస్తూ పరస్పర సంభాషణాధోరణిలో కథను నడిపిస్తారు.

శ్రీనివాసుడు వేటాడుతూ వెళ్ళి చెలికత్తెలతోపాటు వనవిహారం చేస్తున్న పద్మావతిని చూడడం, వకుళమాతను ఆకాశరాజు వద్దకు తన పెళ్ళి రాయబారిగా పంపి తాను ఎరుకత వేషధారి అయి సోది చెప్పడం, కుబేరునివద్ద పెళ్ళికని ధనాన్ని అప్పుచేయడం, అఖిల మునులు, సకల దేవతలు, 'శ్రీనివాసకళ్యాణం' తిలకించడానికి ఆహుతులై రావడం ఇందులోని ప్రధానఘట్టాలు.

జానపదులు అత్యంత ప్రీతిపాత్రంగా తిలకించివినోదించే సాహితీ ప్రక్రియల్లో యక్షగానాలు, బుర్రకథలు, హరికథలు, వీధినాటకాలు ప్రధానమైనవి.

యక్షగానప్రక్రియ గాన ప్రధానమై శ్రోతలను అలరిస్తుంది. ఎరుకల, కాంభోజిరాగం, మోహనరాగం, బిలహరి, సావేరీరాగాలలో సాగే కథాగానం ఈ సాహితీప్రియులను, సంగీతజ్ఞులను అలరిస్తుందనడంలో సందేహంలేదు.

ఆధ్యాత్మికగ్రంథ ప్రచురణను ప్రధానధ్యేయంగా ఉంచుకున్న తిరుమల తిరుపతి దేవస్థానంవారు వెలువరించిన ఈ చిరు పొత్తం పాఠకులకు ఆదరణీయమౌతుందని విశ్వసిస్తున్నాము.

(కె.వి.రమణాచారి)
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

పూవులదూపువేల్పు వలె బోయయతండట కేలరావలెన్,
తీవరకత్తెనై అతని తేజిని రాల్గొని ఏల రువ్వితిన్ ?

**కేదారగౌళరాగము - మిశ్రగతి**

ఆ యలరు విలుకాడొ అతని చెలికాడొ
బోయవలె వచ్చి కొనిపోయెనే నా మనను ॥ఆ యలరు॥
మాయగా, నునులజ్జపాయగా, వెడ కినుక
పూని పూవులరువ్వు వాని రువ్వితి రాల ॥ఆ యలరు॥

పట్టుకొనగాబోయి పట్టుపడినట్లాయె
అయ్యయో ఈ గుట్టు అన్యులెరిగిన రట్టు ॥ఆ యలరు॥
అకట రాచకొలమ్ము, ఆమీద కన్యాత్వ
మెకసక్కెములకు పాలౌనేమొ నా బ్రతుకు ? ॥ ఆ యలరు॥

**కథకుడు**

అనుచు కన్నీరుమున్నీరుగా, అన్నపానములుడిగి, కన్నవారిమోము గననొల్లక, నెచ్చెలులకు మారుపలుకక, తనలో దానులుకుచున్న కన్నియం గాంచి, నమ్మిన నెచ్చెలులు తమలో దామెచ్చరించుకొని దరియజేరి ఏమనుచున్నారు -

**చెలికత్తెలు**

1. అమ్మచెల్లా ! ఇవి భూతచేష్టలేనే.
2. ఔనే. ఈ సోకు పూలతోటలోదేనే.
3. తాళరే. ఇది మగభూతంవలె ఉంది.
4. దీనికి శాంతి కంతుపూజలేనే.

**కథకుడు**

అని మేలమాడు నెచ్చెలుల పద్మావతీకన్య కసరికొట్టుచు కీల్గంటున దురిమిన పూలచెండ్ల విసరికొట్టుచుండ చెలులు -

